చిత్తడిగా భీమడోలు వారపు సంత


భీమడోలులో రోడ్డుపై నిర్వహిస్తున్న సంత


చిత్తడిగా ఉన్న సంతమార్కెట్ ప్రాంతం


బస్టాండ్‌లోని భారీ గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

- భారీ గోతులతో వినియోగదారులు, వ్యాపారులకు అవస్థలు
- గోతులతో నిండిన భీమడోలు బస్టాండ్

భీమడోలు: స్థానిక సంతమార్కెట్ ప్రాంతం చిత్తడిగా మారింది. దీంతో వారపు సంతకు వచ్చే కొనుగోలుదారులు, వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సంత ప్రాంత అభివృద్ధికి వేసిన ఎర్ర కంకర వర్షానికి చిత్తడి చిత్తడిగా మారి బుధవారం వారపు సంతలో సరుకులు కొనేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో నరక యాతనను అనుభవించారు. భీమడోలు సంతకు సమీపంలోని 50 గ్రామాల నుంచి వేలాది మంది వచ్చి వారపులో కూరగాయాలు, సరుకులు కొనుగోలు చేసుకుంటారు. రహదారికి ఇరువైపులా దుకాణాలు ఉండడంతో వారి మోటార్ బైక్‌లు రోడ్డుపై ఉంచడంతో అటుగా వెళ్లే భారీ వాహనాలతో తరచుగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సంత నిర్వహణకు సంబంధిత అధికారులు సరైన ప్రాంతం చూపకపోవడంతో రోడ్డుపైనే వ్యాపారాలు చేసుకుంటున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతమంతా చిత్తడిగా మారడంతో వారపు సంత అనంతరం అపారిశుధ్య వాతావరణం ఏర్పడుతుందని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఏర్పడిందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఇదీ ఉండగా భీమడోలు బస్టాండ్ గోతులతో నిండిపోయింది. 50 గ్రామాల నుంచి వచ్చే వెళ్లే ప్రజలంతా బస్టాండ్ ప్రాంతంలోని గోతుల్లో వర్షపు నీరు చేరి ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఆ గోతులను పూడ్చాలని ద్వారకాతిరుమల దేవస్థానం అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రక్తహీనతతో అనారోగ్య సమస్యలు


కాశిపాడు హైస్కూల్లో విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేస్తున్న హెచ్‌ఎం ప్రసాద్

గణపవరం: విద్యార్థులకు రక్తహీనత వల్ల అనారోగ్య సమస్యలతో పాటు, చదువుపై ఆసక్తి సన్నగిల్లుతుందని హెచ్‌ఎం ప్రసాద్ అన్నారు. గురువారం రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఐరన్ మాత్రల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు ఐరన్ మాత్రలు వేశారు. ప్రతి గురువారం ఆరోగ్యశాఖ అందిచే ఐరన్ మాత్రలు ప్రతి విద్యార్థి వేసుకోవాలని ఆరోగ్య సహాయకుడు నామాలరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీటీసీ చాంబర్ ఉపాధ్యక్షురాలిగా జయలక్ష్మి


కొరిపల్లి జయలక్ష్మి

ఉంగుటూరు: జెడ్పీటీసీ చాంబర్ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన ఉంగుటూరు జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. గురువారం ఏలూరులోని జెడ్పీ కార్యాలయంలో ఈ ఎన్నిక నిర్వహించారని జయలక్ష్మి తెలిపారు. తనను జెడ్పీటీసీ చాంబర్ ఉపాధ్యక్షురాలిగా ఎంపిక చేసిన తోటి జెడ్పీటీసీ సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు


విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

భీమడోలు: రాష్ట్రీయ రహదారి పోలసానిపల్లి శివారు వద్ద ఓ కారు అదుపు తప్పి గురువారం ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ద్వారకాతిరుమల నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారులో నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. పోలసానిపల్లి శివారుకు వచ్చే సరికి అదుపు తప్పిన కారు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్తంభం విరిగిపోవడంతో భీమడోలు, పోలసానిపల్లి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ సిబ్బంది మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

16, 17 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సమావేశాలు

ఏలూరు (టూటౌన్): ఈనెల 16, 17 తేదీలల్లో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సమావేశాలు ఏలూరులో నిర్వహించనున్నట్టు రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ తెలిపారు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో సమావేశాల కరపత్రాన్ని గురువారం సాయంత్రం ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటోన్న అనేక సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ పోరాడనున్నట్టు చెప్పారు. ఏలూరులో నిర్వహించే రాష్ట్ర మహాసభల్లో పెద్ద సంఖ్యలో విద్యారుథలులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

14న సీఆర్‌ఆర్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్మీడియట్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్ బీ కెరీర్ ప్రోగ్రాం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించడంలో భాగంగా ఈ నెల 14న క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సీఆర్‌ఆర్ కళాశాలలో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ డ్రైవ్‌లో పాల్గొనే విద్యార్థులు తమ తల్లిదండ్రులతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 96663 22032, 96525 03799లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆదర్శ ముఖ్యమంత్రి భట్టాచార్య

ఏలూరు (టూటౌన్): ఆదర్శ ముఖ్యమంత్రి బుద్దదేవ్ భట్టాచార్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కొనియాడారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్దదేవ్ భట్టాచార్య ఆకస్మిక మృతికి సంతాపం తెలియజేస్తూ గురువారం సాయంత్రం సంతాప సభ నిర్వహించారు. నగర కార్యదర్శి పి.కిషోర్, సీనియర్ నాయకలు పి.ఆదిశేషు, వీజీఎంఆర్ కృష్ణారావు తదితరులు భట్టాచార్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: స్థానిక గుడిగుంట పరిధిలోని అన్ని ఫీడర్లలో లైన్ల నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ నటరాజన్ తెలిపారు. జోగన్నపాలెం, నాగులదేవునిపాడు, సానిగూడెం, అక్కిరెడ్డిగూడెం, గంగన్నగూడెం, అప్పారావు పాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

పూళ్ల, ఎంఎంపురం ఫీడర్ల పరిధిలో..

భీమడోలు: పూళ్ల 33 కేవీ, ఎంఎంపురం 11 కేవీ ఫీడర్ల పరిధిలో లైన్ల నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎస్‌ఈ జేపీబీ నటరాజన్ తెలిపారు. పూళ్ల, ఎంఎంపురం, కురెళ్ల గూడెం, దుద్దేపూడి, కోడూరుపాడు, దుద్దేపూడి, అంబర్‌పేట, వడ్లపట్ల, అన్నేవారిగూడెం, జి.కండ్రిక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

కొక్కిరపాడు సబ్‌స్టేషన్ పరిధిలో..

పెదపాడు : కొక్కిరపాడు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ నటరాజన్ తెలిపారు. దాసరిగూడెం, కొక్కిరపాడు, వేంపాడు గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఏలూరులో 30కి పైగా నూతన ఆర్టీసీ బస్సులు

దెందులూరు: ఏలూరులో 30కుపైగా నూతన ఆర్టీసీ బస్సులు ప్రవేశపెడుతున్నామని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారంఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఎమ్మెల్యేలు ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, బడేటి చంటి మంత్రిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం నియోజకవర్గాలోని రవాణా, ఇతర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు


వాకపల్లిలో రసాయనాల పిచికారీ

గణపవరం: ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పారిశుధ్య పనులు చేపట్టారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లి, రసాయనాలు పిచికారీ చేయిస్తున్నారు. తుప్పలు, పెంటకుప్పలు తొలగించి, పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. డ్రైయిన్లలో సిల్టు తొలగించి, మురుగునీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మంచి నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేస్తున్నారు. వర్షాలకు చెరువుల్లో నీరు కలుషితమైనందున ప్రజలంతా మంచినీటికి కాచిచల్లార్చిన తర్వాతే తాగాలని జల్లికాకినాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ గ్రామంలో టాంటాం వేయించారు.

కూటమి నాయకుల్లో విభేదాలు

- తలలు పట్టుకున్న టీచర్లు
- నిలిచిన పూళ్ల హైస్కూల్ ఎస్‌ఎంసీ ఎన్నిక

భీమడోలు: పాఠశాల నిర్వహణ కమిటీల ఎన్నికల్లో గురువారం పలు చోట్ల కూటమి నాయకుల విభేధాలతో ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకున్నారు. కూటమి నాయకులు తమదే పై చెయ్యి కావాలన్న పట్టుదలతో సజావుగా సాగుతున్న ఎన్నికల ప్రక్రియకు ఆటంకంగా మారారు. కూటమి నాయకులు కలిసి కట్టుగా రాకుండా ఎన్నిక పూర్తయిన తర్వాత వేర్వేరుగా వచ్చి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని కోరడంతో ఉపాధ్యాయులు నానా తంటాలు పడ్డారు. వారికి ఎన్నికల నిబంధనలు చెప్పి వారిని ఒప్పించేందుకు టీచర్లు పడ్డ కష్టాలు వర్ణానాతీతం. ఇదీలా ఉండగా పూళ్ల పంచాయతీ పరిధిలోని పూళ్ల ఉన్నత పాఠశాల, ఎంఎంపురం ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు ఇబ్బందిగానే మారాయి. భీమడోలు మండలలోని 44 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాలలకు గాను 43 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్టు ఎంఈఓలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్ కుమార్‌లు తెలిపారు. పూళ్ల హైస్కూల్ ఎస్‌ఎంసీ ఎన్నికలు విద్యార్థుల తల్లిదండ్రులు కోరం లేక నిలిచిపోయాయన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియను తహసీల్దార్ బి.రమాదేవి పరిశీలించారు.


భీమడోలులో ఎన్నికల నిర్వహణపై తహసీల్దార్ ఆరా

గణపవరం మండలంలో

గణపవరం: మండలంలోని ఏడు ఉన్నత, పది యూపీ, 45 ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌ఎంసీలకు ఎన్నికలు నిర్వహించారు. ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, ఇతర కోఆప్షన్ సభ్యుల ఎన్నికల నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను ఎంఈఓలు పుచ్చల శేషు, గొర్రెల బాలయ్య ఎన్నికలను పర్యవేక్షించారు.

నిడమర్రు మండలంలో

నిడమర్రు: మండలంలోని ఏడు జెడ్పీ, 31 ప్రాథమిక, ఒక యూపీ స్కూల్లో పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు నిర్వహించినట్టు ఎంఈఓ పుచ్చల శేషు తెలిపారు. ఈ ప్రక్రియ పర్యవేక్షకునిగా ఎంఈఓ–2 కె.రాంబాబు వ్యవహరించారు. చానమిల్లి, తోకలపల్లి, పెదనింద్రకొలను, చిననింద్రకొలను, బావాయిపాలెం, నిడమర్రు, అడవికొలను జెడ్పీ స్కూళ్లు, బువ్వనపల్లి యూపీ స్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్టు అధికారులు ప్రకటించారు.

ఉంగుటూరు మండలంలో ఎస్‌ఎంసీల ఎన్నిక

ఉంగుటూరు: మండలంలోని కైకరం, ఉప్పాకపాడు, తల్లాపురం, ఉంగుటూరు పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రాధానోపాధ్యాయులు పర్యవేక్షించారు.

పుస్తక నిర్వహణ తప్పనిసరి

ఉంగుటూరు: గ్రామసంఘాలకు పుస్తక నిర్వహణ తప్పనిసరని ఏరియా కోఆర్డినేటర్ అనిత అన్నారు. డ్వాక్రా సంఘ భవన్‌లో మండల సమాఖ్య సమావేశం ఎంపీఎం శ్యామల అధ్యక్షతన నిర్వహించారు.

తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ రక్షణ

దెందులూరు: తల్లిపాలతోనే బిడ్డకు రక్షణ అని వేగివాడ సెక్టార్ సూపర్‌వైజర్ అన్నారు. గురువారం వేగివాడ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

జ్ఞానేశ్వరికి రూ.35 వేల విరాళం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కాలేయ శ్యాధికి శస్త్ర చికిత్స చేయించుకున్న చిన్నారి జ్ఞానేశ్వరికి స్థానిక ఆదివారపు పేట శ్రీ షిరిడీ సాయి ప్రేమ మందిరం ఆధ్వర్యంలో రూ.35 వేల నగదును చిన్నారికి నాట్యం నేర్పుతున్న గురువు స్వర్ణలతకు అందజేశారు. సాయి మందిరంలో గురువారం మందిరం అధ్యక్షుడు ఇసుకపల్లి తాతారావు, గురువు వాసా ప్రసాదరావు అధ్యక్షతన ఆలయ సేవకుల నుంచి సేకరించిన ఈ మొత్తాన్ని జ్ఞానేశ్వరికి అందజేశారు.

చెడు అలవాట్లతో భవిష్యత్తు నాశనం

గణపవరం: విద్యార్థి జీవితం ఎంతో విలువైందని, దీనిని చెడు అలాట్లకులోనై పాడుచేసుకోవద్దని గణపవరం ఎస్సై వి.వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రసాయనశాస్త్రం, సోషల్ వర్కు, హెచ్‌ఆర్ శాఖల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం, అనర్థాలపై విద్యార్థులకు ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అధ్యక్షత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ నిషేధిత మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఎంతో విలువైన భవిష్యత్తు నాశనమవుతుందని, ఆరోగ్యం పాడై, చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. ఇటీవల యువత ముఖ్యంగా విద్యార్థులు మాదక ద్రవ్యాలపట్ల ఆకర్షితులవుతూ, విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవడం ఆందోళన కలిగిస్తుందని చెప్పారు. పాఠశాలలు కళాశాలల్లో మాదక ద్రవ్యాల వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ మాట్లాడుతూ పొగాకు, గుట్కా, గంజాయి తదితర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వారితోపాటు పక్కనున్న వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుదని అన్నారు. అనంతరం విద్యార్థులతో చెడు అలవాట్లకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు, ఐక్యు సమన్వయకర్త చైతన్య, అధ్యాపకులు స్వరూపరాణి, సత్యనారాయణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు

ప్రతి విద్యార్థీ పాఠశాలలోనే భోజనం చేయాలి

భీమడోలు: పాఠశాలకు హాజరైన ప్రతి విద్యార్థీ మధ్యాహ్న భోజనం చేయాలని సమగ్ర శిక్షా భియాన్ జిల్లా బాలికా సంరక్షణాధికారిణి సబియా సుల్తానా అన్నారు. దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును గురువారం ఆమె పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడిందీ లేనిదీ పరిశీలించారు. శుభతిథి భోజనాలను ప్రతిరోజు అమలు చేయడం పట్ల ఆమె హెచ్‌ఎం మస్తాన్‌ను అభినందించారు. పాఠశాలకు హాజరైన 122 మంది బాలబాలికల్లో 108 మంది భోజనం చేశారు. పాఠశాలకు హాజరైన ప్రతి విద్యార్థీ భోజనం చేసేలా ఉపాధ్యాయులు తగు శ్రద్ధ వహించాలని సూచించారు. ఎండీఎం నిర్వాహకులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు.


అన్నేవారిగూడెంలో ఎండీఎంను పరిశీలిస్తున్న జిల్లా జీసీడీఓ సబియా సల్తానా

పాఠశాలల్లో చైర్మన్, వైస్‌చైర్మన్ కమిటీల ఎన్నిక

దెందులూరు: దెందులూరు మండలంలో ఉన్న 54 పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండలంలో ఆరు ఉన్నత, ఒక బీసీ వెల్ఫేర్, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఒక ఎయిడెడ్ పాఠశాల, ఒక యూపీ పాఠశాల, 44 ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. ఈ స్కూళ్లలో ఎన్నికలు సందర్భంగా తహసీల్దార్ బి.సుమతి, ఎంఈఓలు ఏవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ, పాఠశాల హెచ్‌ఎం జీఎస్‌ఎల్‌ఎన్‌వీ శర్మలు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీలు విద్యార్థుల అభివృద్ధి, పాఠశాలల సంక్షేమానికి, మౌలిక వసతుల కల్పనకు పాటుపడాలని సూచించారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం, విద్యాభివృద్ధి తొలి లక్ష్యం కావాలన్నారు. నూతన కమిటీలకు శుభాకాంక్షలు తెలిపారు.


కొవ్వలి హైస్కూల్లో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో రైతుల సౌకర్యార్థం ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు ఏలూరులోని ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో 241 నంబరు ప్రశ్నలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 26 జిల్లాలకు ఏడు ఇంక్యుబేషన్ కేంద్రాలు మాత్రమే ఉన్నాయని, ఏలూరు జిల్లాలో లక్ష మందికి పైగా ఉన్న పామాయిల్ రైతులు లబ్ధి కోసం ఏలూరు జిల్లాలో వ్యవసాయ పరిశోధన, ప్రాసెసింగ్, ఉత్పత్తి కేంద్రం (ఇంక్యుబేషన్ సెంటర్) ఏర్పాటు చేయాలని కోరారు.

గుండేరు వాగు వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు



సత్యనారాయణ పురం వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి, దెందులూరు గుండేరువాగు వద్ద ఫెన్సింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

దెందులూరు: దెందులూరులో ఉధృతంగా ప్రవహిస్తోన్న గుండేరువారు వద్ద గురువారం కర్రలతో ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయించారు. గతంలో ఈ వాగులో మహిళ మృతి చెందగా, ఒక చిన్నారి కొంత కొట్టుకుపోయిన సంగతి విదితమే. భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోకుండా పెన్సింగ్ ఏర్పాటు చేయించి, అలుగులగూడెం వైపు, దెందులూరు వైపు వీఆర్‌ఏలను నియమించినట్టు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. సత్యనారాయణపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును ఆమె పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితిపై ఆరా తీశారు. కొవ్వలి వద్ద వాగులో వరద ప్రవహానికి అడ్డుగా ఉన్న తూడు, గుర్రపుడెక్కను అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ వెంట మూడు గ్రామాల వీఆర్‌ఓలు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థినుల నిరసన

ఏలూరు (టూటౌన్): సమస్యలు పరిష్కరించాలంటూ స్థానిక అమీనాపేట సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్థినులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ హైస్కూల్ స్థాయి నుంచి డిగ్రీ వరకు దాదాపు వెయ్యి మంది విద్యార్థినులు ఈ హాస్టల్స్‌లో ఉంటున్నట్టు చెప్పారు. హాస్టల్‌కు వెళ్లే రోడ్డులో మొదటి రెండు ఇళ్ల వరకే రోడ్డు ఉందని మిగతాదంతా అధ్వానంగా మారిదని, హాస్టల్ దగ్గర గోడ నుంచి సబ్ స్టేషన్ వరకు ఉన్న రోడ్డు నిర్మాణాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేశారంటూ అధికారులను ప్రశ్నించారు. వానాకాలం వస్తే విద్యార్థినులు రోడ్డు దాటి రావడానికి అనేక కష్టాలు పడుతున్నారని తెలిపారు. డ్రెయినేజీ నీరు నిల్వ ఉండి దోమల ప్రభావం ఎక్కువగా ఉందని, విద్యార్థినులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టల్ చుట్టూ డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని లెనిన్ డిమాండ్ చేశారు. నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


వర్షాకాలం.. విద్యుత్‌తో జర భద్రం

- సమస్యలపై ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నెంబర్ 1912
- నగరంలో మొత్తం విద్యుత్ సర్వీసులు 1,38,999


ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వర్షాకాలం వచ్చిందంటే భారీ వర్షాలు, ఈదురుగాలు సహజం. ఆ సమయాల్లో విద్యుత్ తీగలు తెగిపడడం, స్తంభాలు ఒరిగిపోవడం, గోడల్లో ఎర్త్ రావడం వంటి ఘటనలు జరుగుతుంటాయి. కాస్త అప్రమత్తంగా వ్యవహరిస్తే ఇటువంటి ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. గృహ విద్యుత్ వినియోగదారులే కాక వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రైతులకు కూడా పొలాల్లో రైతులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. గత మంగళవారం ఏలూరు నగరంలోని వంగాయగూడెం ప్రాంతంలో అశోక్ కుమార్ అనే వ్యక్తి మోటారు వేయడానికి వెళ్లి తెగిపడి ఉన్న విద్యుత్ వైరును చూసుకోకుండా తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందడం కలకలం రేపింది. ఏలూరు నియోజకవర్గంలో మొత్తం విద్యుత్ సర్వీసులు 1,38,999 ఉన్నాయి. వీటిలో గృహావసర, గృహేతర, పరిశ్రమలు, వ్యవసాయానికి సంబంధించిన సర్వీసులు ఉన్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షకాలంలో నివాసాల మధ్యలో ఉండే విద్యుత్ స్తంభాలను, వీటిని తాకుతూ వెళ్లే టెలిఫోన్, కేబుల్ టీవీ వైర్లనూ తాకే ప్రయత్నం చేయొద్దు.
- సబ్‌స్టేషన్ వంటి ప్రాంతాల్లో రక్షణ తీగలకు దూరంగా ఉండాలి.
- తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు, మరమ్మతులు చేయకూడదు.
- ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ వంటి పరికరాల వద్దకు పిల్లలు రాకుండా చూడాలి.
- నీరు ఉన్న పరిసరాలు, వర్షం కురిసే, జల్లులు పడే అవకాశం ఉన్న చోట విద్యుత్ పరికరాలు ఉంచ కూడదు.
- ట్రాన్స్‌ఫార్మర్లకు దగ్గరగా వెళ్లకూడదు.
- రైతులు, వ్యవసాయ కార్మికులు పంట పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయో లేదో ఒకటికి రెండు, మూడు సార్లు పరిశీలించుకుని నీటిలోకి వెళ్లాలి.
- పొలాల వద్ద బోర్లకు రక్షణ కవచం ఏర్పాటుచేసుకోవాలి.
- పొలాల్లో మోటార్లు పని చేయకపోతే చేతితో పట్టుకోకూడదు. టెస్టర్ సహాయంతో మాత్రమే పరీక్షించాలి.
- స్టార్టర్ డబ్బాలను వర్షపు నీరు, తేమ తగలని చోట అమర్చి రక్షణగా కవర్ కప్పాలి. ఎర్తింగ్ తప్పనిసరిగా ఉంచుకోవాలి. మోటారుకు ఏదైనా మరమ్మతు చేయాలంటే ముందుగా విద్యుత్ సరఫరా నిలిపివేయాలి.


నగరంలోని రామకృష్ణాపురంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా సమస్య ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలి. విద్యుత్ తీగల్లో మార్పు గమనిస్తే వెంటనే సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలి. పలుచోట్ల స్తంభాలు పడిపోతున్నాయి. ప్రతి ప్రాంతంలో చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతులు చేయిస్తున్నాం. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ముప్పు ఉండదు.

– జేపీటీ నటరాజన్, ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్